క్లుప్తంగా

పురస్కార గ్రహీత అలీమ్‌కు సత్కారం


అలీమ్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: మండలం యండమూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కా గ్రహీత మహ్మద్ అబ్దుల్ అలీమ్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ మార్రెళ్ల శ్రీనివాస్ (శివ), మాజీ సర్పంచ్ మార్రెళ్ల వెంకటరమణ, మండల అంబేడ్కర్ యువజన సేవాసంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు, షేక్ దరియా తదితరులు ఉపాధ్యాయుడిగా ఆయన సేవలకు తగిన గుర్తింపు లభించిందని కొనియాడారు.

రేపు అద్దేపల్లి సాహిత్య పురస్కార సభ

కాకినాడ కల్చరల్: ప్రముఖ సాహితీ విమర్శకుడు మేడేపల్లి రవికుమార్‌కు ప్రజాకవి అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య విమర్శ పురస్కారాన్ని శనివారం ప్రదానం చేయనున్నారు. స్థానిక శ్రీముత్తా సత్యప్రసన్నం రోటరీ సర్వీస్ సెంటర్ సమావేశ మందిరంలో సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్టు అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య విమర్శ పురస్కార వేదిక కన్వీనర్ అద్దేపల్లి ప్రభ తెలిపారు. సాహిత్యాభిమానులు అందరూ హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

నిప్పునంటూ నోటీసులకు భయమేల బాబూ


జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: నేను నిప్పు అని చెప్పుకునే చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులతో భయమెందుకని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి ప్రశ్నించారు. 49వ డివిజన్ కొత్త గైగోలుపాడు తన నివాసంలో గురువారం మీడియాతో ఆమె మాట్లాడుతూ చంద్రబాబును చూసి నాలుగు సింహాలు సిగ్గు పడతాయన్నారు. ఐటీ కేసుల్లో అడ్డంగా దొరికిపోయినా ప్రజల్లో సానుభూతి కోసం చంద్రబాబు అరెస్టు డ్రామాలు ఆడుతున్నారన్నారు. అరెస్టు చేస్తే కేంద్రం చేస్తుందన్నారు.

కాకినాడలో కాంగ్రెస్ ర్యాలీ

కాకినాడ: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేపట్టిన జూడో యాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకూరి పాండురంగారావు ఆధ్వర్యంలో స్థానిక భానుగుడి సెంటర్ నుంచి కళావెంకట్రావు భవన్ వరకు పాదయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆకుల వెంకటరమణ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల జాబితా ఆన్‌లైన్ పనులు


పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

పిఠాపురం: గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన ఓటర్ల సర్వే పూర్తయ్యింది. కాగా ఓటర్ల జాబితా ఆన్‌లైన్ పనులు జోరుగా సాగుతున్నాయి. పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం మున్సిపల్ కార్యాలయాల్లో గత వారం రోజులుగా ఓటర్ల జాబితా ఆన్‌లైన్ పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 50 శాతానికి పైగా ఆన్‌లైన్ పనులు పూర్తవ్వగా మిగిలిన పనులు వేగవంతం చేశారు. కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం తహసీల్దార్లు ప్రసాద్, వెంకటేశ్వరరావు, త్రినాథ్‌తో పాటు పిఠాపురం మున్సిపల్ కమిషనర్ తదితరులు పనులను పర్యవేక్షిస్తున్నారు. వచ్చే వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో అధికారులు తమ సిబ్బందితో పనులను వేగవంతం చేశారు.

పంచారామ క్షేత్రంలో 10న వేద పరిషత్

సామర్లకోట: ఏటా మాదిరిగానే ఈ నెల పదో తేదీన పంచారామ క్షేత్రమైన శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో 25వ వేద పరిషత్ నిర్వహిస్తున్నారు. పరిషత్తు కన్వీనర్ గ్రంధి సత్యరామకృష్ణ గురువారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని వేద పండితులతో వేద సభ నిర్వహించి, వారిని సత్కరిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లోక కల్యాణార్థం చతుర్వేద పారాయణ, వేద స్వస్తి జరుగుతాయని చెప్పారు. వేద సభకు భక్తులు హాజరు కావాలని కోరారు.

మందు లేని వైద్యం.. నొప్పులు మాయం

- ఫిజియోథెరపీతో దీర్ఘకాలిక సమస్యలు దూరం
- మందులు, ఇంజెక్షన్లు లేకుండానే చికిత్స
- నేడు ఫిజియోథెరపీ దినోత్సవం

బోట్‌క్లబ్: ఎంతటి ధీరులైనా శారీరక అనారోగ్యానికి గురైనపుడు కొందరు చిన్న ఇంజెక్షన్‌కి భీరువులా మారిపోతారు. ట్యాబలెట్ వేసుకోవాలంటే నోట్లో ట్యాబ్‌లెట్ పడగానే ముఖం ముప్పై వంకర్లు తిప్పి ఆపసోపాలు పడుతూ మింగుతారు. మరికొందరు బయటకు కక్కేస్తారు. ఇంజెక్షన్ అన్నా, ట్యాబ్‌లెట్ వేసుకోవడం అన్నా చాలా ఇళ్లలో ఒక పెద్ద ప్రహసనంలా నడుస్తుంది. కానీ శరీరంలో ఏ భాగానికైనా బెణుకో, నరం మెలిక పడడమో, కీళ్లు జారిపోవడమో, పక్కకు మెలి పడడమో జరిగితే ఇంజెక్షన్, ట్యాబ్‌లెట్ అవసరం లేకుండా ఫిజియో థెరపీతో నొప్పి మాయం చేస్తూ సమస్యకు వైద్యం చేయవచ్చు. నేడు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏదైనా గాయం వల్లో, వ్యాధి కారణంగానో శారీరక రుగ్మత, వైకల్యం ఎదురైతే దాని నివారణ, చికిత్స ద్వారా వైకల్యాన్ని నివారించి ఆరోగ్యవంతునిగా చేసే ప్రక్రియ ఫిజియో థెరపీ. శరీరం, శాశ్వత అనారోగ్యం, గాయంతో బాధపడుతుంటే దాని ప్రభావాన్ని తగ్గించడానికి ఫిజియో థెరపీకి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. ఈ ప్రక్రియ ఒక శారీరక చికిత్స మాత్రమే. ఎలాంటి మందుల ప్రమేయం లేని చికిత్స ఇది. శారీరకంగా వచ్చే నొప్పిని నివారించడానికి విద్యుత్ పరికరాలతో పాటు కండరాలు, కీళ్లు, నరాల సామర్థ్యాన్ని పెంచడానికి శారీరక కసరత్తుల ద్వారా చికిత్స చేస్తారు. వివిధ రకాల శస్త్ర చికిత్సల అనంతరం రోగుల జీవన విధానం మెరుగు పరచడంలో ఈ ఫిజియో థెరపీ పాత్ర కీలకం. రోగి ఎవరి మీదా ఆధారపడకుండా తన పనులు సొంతంగా చేసుకునేలా ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మునపటి ఉత్సాహంతో పాటు స్వీయ విశ్వాసాన్ని అందిస్తుంది.

సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం

మందులతో వచ్చే సైడ్ ఎఫెక్టులను గుర్తించిన ఎంతో మంది దేశ, విదేశాల్లో వైద్య నిపుణులు ఫిజియోథెరపీని ప్రోత్సహిస్తున్నారు. ఈ వైద్యం ద్వారా దీర్ఘకాలిక సమస్యలైన స్పాండిలైటిస్, ఫ్రోజెన్ షోల్డర్, టెన్నిస్ ఎల్బో తదితర ఇబ్బందులు నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ మధ్య కాలంలో యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఫోన్లు, కంప్యూటర్ల వాడడం వల్ల భుజాలు, మెడ, నడుం నొప్పులతో బాధ పడుతున్నారు. ఇటువంటి వారికి ఫిజియోథెరపీ వైద్యం ద్వారా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా ఉపశమనం పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.


రోగికి ఫిజియోథెరపీ చేస్తున్న నిపుణురాలు, సహాయకురాలు

వయసుతో సంబంధం లేని రుగ్మతలు



ఆధునిక జీవన విధానంలో వచ్చే ఇబ్బందులకు ఫిజియో థెరపీ ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా చిన్న వయస్సులో శారీరక రుగ్మతలు వస్తున్నాయి. వాటిని పరిష్కరించేందుకు ఫిజియో థెరపీ చాలా ఉపయోపడుతుంది.

కె.కీర్తి, ఫిజియోథెరపీ నిపుణురాలు

మెడికవర్‌లో 'ఆరోగ్య భద్రత' సేవలు ప్రారంభం


పోలీస్ భద్రత సేవలు ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

కాకినాడ క్రైం: స్థానిక ఏడీబీ రోడ్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల ఆరోగ్య భద్రత నిమిత్తం ప్రవేశపెట్టిన 'ఆరోగ్య భద్రత' సేవలు ప్రారంభమయ్యాయి. గురువారం ఈ సేవలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రారంభించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్లో మెడికవర్ కాకినాడ హెడ్ సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్య భద్రత సేవలు మెడికవర్‌లో అందుబాటులోకి రావడం పోలీస్ వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చే అంశమన్నారు. నిష్ణాతులైన వైద్య బృందాలు, అధునాతన పరికరాల సాయంతో పోలీసులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఎస్పి సతీష్‌కుమార్ ఆసుపత్రి కాకినాడ హెడ్ సిద్ధారెడ్డిని కోరారు. అదనపు ఎస్పీ శ్రీనివాస్, మెడికవర్ నుంచి విజయసారథి, గుమ్మళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి


వలసపాకలలో శ్రీకృష్ణుని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామంలో శ్రీ కృష్ణయాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. వాకలపూడి, వలసపాకల గ్రామాల్లో యాదవ సంఘాలు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు. జిల్లాలో యాదవ సంక్షేమ సంఘానికి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి వాకలపూడిలో స్థలం కేటాయించామని, భవన నిర్మాణం చేపడతామన్నారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, యాదవ సంఘ నాయకులు అల్లి రాజబాబు, నమ్మి రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణావతారంలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి గురువారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక అశోక్‌నగర్ గోకులంలో ఉదయం గోపూజ, పల్లకి సేవ నిర్వహించారు.


కృష్ణునిగా దర్శనమిస్తున్న సీతారామస్వామి

అభాగ్యునికి ఆసరాగా ఆరోగ్యశ్రీ

కాకినాడ: నిరుపేదలు, అభాగ్యులను ఆదుకోవడంలో ఆరోగ్యశ్రీ ఎంతగానో తోడ్పడుతోంది. స్థానిక గాంధీనగర్ ప్రాంతానికి చెందిన రాజాపంతుల సుబ్బారావు చిన్న హోటల్‌లో పనిచేస్తూ ఒంటరిగా రోజులు వెళ్లదీస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం అస్వస్థతకు గురై రోడ్డుపై పడిపోవడంతో తుంటి ఎముక విరిగి నడవలేని పరిస్థితి ఏర్పడడంతో అక్కడి మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి కొందరి సాయంతో అతనిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎముకకు శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు చెప్పారు. అంత ఆర్థిక స్థోమత అతనికి లేకపోవడంతో సత్యవతి ఈ విషయాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి వివరించారు. ఈ మేరకు ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సుబ్బారావుకు ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు చేయించారు. దీంతో అతడికి అరుణ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసి ఆసరాగా రూ.5 వేలు ఇచ్చి గురువారం డిశ్చార్జి చేశారు. ఈ మేరకు సుబ్బారావు ఎమ్మెల్యే ద్వారంపూడికి, అరుణ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ చవ్వాకుల శేషగిరిరావు, నీలకాయల శ్రీను, గోళ్ళ రమేష్‌లకు, గోడి సత్యవతికి ధన్యవాదాలు చెప్పారు.


ఆరోగ్యశ్రీతో కోలుకున్న సుబ్బారావు

ఘనంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం


బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న ఖాతాదారులు, అధికారులు

బాలాజీచెరువు: బ్యాంక్ ఆఫ్ ఇండియా 118వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భానుగుడి జంక్షన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గురువారం కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అత్యధికంగా ఖాతాదారులు, ఇతరులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శాఖ సిబ్బంది, ఖాతాదారులు ముఖ్యంగా మహేంద్ర మిఠాయివాలా, కాకినాడ మహేంద్రకుమార్ కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 30 సంవత్సరాల నుంచి ఖాదాదారులైన బాలాజీ సుగణాసింగ్, స్వయంసేవా సంఘాలకు బ్యాంక్ ఆఫ్ ఇండియా భానుగుడి శాఖ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎం.ప్రవీణ్ కుమార్, ఇతర ఉద్యోగులు, ఖాతాదారులు బ్యాంక్ అందించే వివిధ సేవలు, పథకాలు తెలియజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: జాతీయ రహదారులను విస్తరించే క్రమంలో చేపట్టే పనుల దృష్ట్యా శనివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఆపరేషన్స్ ఈఈలు జి.ప్రసాద్, వై.విజయానంద్, జె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. పనుల్లో భాగంగా మాధవపట్నం ప్రాంతంలో ట్రాన్స్‌కోకు సంబంధించిన టవర్లను పక్కకు జరపాల్సి ఉందని, దీని వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తుందన్నారు. ఈ కారణంగా కాకినాడ ప్రతాప్‌నగర్, పోర్టు ఏరియా, నడకుదురు, గొల్లపాలెం, మామిడాడ, తాళ్లరేవు, రామచంద్రపురం ప్రాంతాల్లో పై సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు ఈ అసౌకర్యానికి సహకరించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

తాళ్లరేవు: స్థానిక నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.మంగాయమ్మ తెలిపారు. తాళ్లరేవు, చొల్లంగి గ్రామాల్లో మూడు రోజుల పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

నీటి మీటర్ల బకాయిలపై దృష్టి పెట్టండి

- కమిషనర్ నాగ నరసింహారావు సమీక్ష
- ఏఈలకు వసూళ్ల బాధ్యతల అప్పగింత

కాకినాడ: నీటి మీటర్ల బకాయి వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ నాగనరసింహారావు అధికారులకు ఆదేశించారు. గురువారం ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, రెవెన్యూ విభాగానికి చెందిన అధికారులతో కమిషనర్ ఈ విషయమై సమీక్షించారు. వివిధ విభాగాల సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నందున, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఏఈలు, ఏమినిటీ కార్యదర్శులు నీటి మీటర్ల బకాయిల వసూళ్ల బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లకు సంబంధించి ఇప్పటికే నోటీసులు జారీ చేశామని కమిషనర్ చెప్పారు. నోటీసులకు స్పందించకపోతే కుళాయి కనెక్షన్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఆర్వోలు చెక్కా రమణ నిర్మలా కుమారి, డీఈ సుబ్బారావు, ఏఈలు వై.నాగేశ్వరరావు, లోవరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్ నాగనరసింహారావును సత్కరిస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

కమిషనర్‌కు బీసీ ఉద్యోగుల సత్కారం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమం సంఘం అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం ఆధ్వర్యంలో గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగనరసింహారావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం భవనానికి కాకినాడలో స్థలం ఇప్పించాల్సిందిగా కోరారు. సంఘ నాయకులు దొమ్మేటి సుధాకర్, జి.రాధాకృష్ణ, వి.కామేశ్వరరావు, డి.ముక్తేష్, ఎస్.వర్మ, కె.వెంకటేశ్వర్లు, ములంపాక శ్రీనివాసరావు కమిషనర్‌ను సత్కరించారు.

ఉదయ నిధి స్టాలిన్ వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన


పిఠాపురంలో ఆందోళన చేస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ సభ్యులు

పిఠాపురం: తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయ నిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పిఠాపురంలో గురువారం విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పిఠాపురంలో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ సభ్యులు ఉప్పాడ సెంటర్లో ఉదయ నిధి స్టాలిన్‌కి చెందిన సన్‌డైరెక్ట్ డిష్‌ను దహనం చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉదయ నిధి స్టాలిన్ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఉదయ నిధి స్టాలిన్‌పై కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సభ్యులు సురేంద్ర దత్త, అరిగెల ప్రసాద్, ఎం.రమణ, రమణ, రవి కుమార్, సాధు సంతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెద్దాపురం: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా ఈ నెల 8న పలు దేవాలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్టు దేవదాయ శాఖాధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మరిడమ్మ ఆలయం, శృంగార వల్లభుని ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈఓలు రామ్మోహనరావు, పులి నారాయణమూర్తి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు.

ఎస్టీయూ సమావేశం

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మండల ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో నాలుగు మండలాల ఎస్టీయూ ఎగ్జిక్యూటివ్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి, పిఠాపురం, కిర్లంపూడి, గొల్లప్రోలు మండలాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.